
# నివురు - నిప్పు



— ద్విభాష్యం రాజేశ్వరరావు



తొంగిచూస్తే

ఫోటో—హెచ్. ఎస్. సాంబమూర్తి (బంగుళూరు-...)

బారులు తీర్చిన పాలదీపాల తెలివెలుగులో సికిందరాబాదు స్టేషన్ పెళ్లిపందిరిలా వెలిగిపోతూంది. హడావుడిగా ప్లాట్‌ఫారం మీద అడుగు పెట్టాను. రైలు బయలుదేరే సూచనగా ప్లాట్‌ఫారం చివర పచ్చ దీపం కాంతిని విరజిమ్ముతూంది. హౌరా ఎక్స్‌ప్రెస్ బయలుదేరటానికి ఇంక కేవలం మూడు నిమిషాలు మాత్రమే వ్యవధి ఉంది. త్వరితంగా అడుగు లేసుకుంటూ స్లీపర్ వద్దకు నడిచాను. బోగీ ద్వారం వద్ద అంటించిన లిస్టులో నా పేరు కోసం వెదికాను. 27 వ నెంబరు ఎదురుగా నా పేరు కనబడింది. భుజానికున్న ఎయిర్-బాగు సర్దుకుంటూ కంపార్టుమెంటులోకి ఎక్కి నా సీటు కోసం వెదుకుతూ ముందుకు నడిచాను.

నా అదృష్టంకొద్దీ అది కిటికీ పక్క సీటే! మిగిలిన రెండు సీట్లలోనూ ఆడవాళ్లెవరో ఉన్నారు. బాగు తీసి సీటుమీద ఉంచి పక్కకు చూశాను. నా పక్క సీటులోని ఆమె చదువుతున్న పుస్తకంలోంచి తల ఎత్తింది.

ఉలిక్కిపడ్డాను! ఆమే...

ఆమె రజని!

ఏనాటి దీ రజని? !

సుమారు ఎనిమిది సంవత్సరాల క్రితం...

అమరేశ్వరుని కోవెల ప్రాంగణాన— జిలిబిలి కెరటాలతో సొగసు లీనుతూ, మడులు తిరుగుతూ వయ్యారాలు పోతున్న కృష్ణవేణమ్మ ఒడ్డున, నా ఒడిలో తల వాల్చి గారాలు పోయిన రజని!

"కృష్ణా! ఎవరి జీవితాలు ఎవరికి అంకితం కావటానికి ఉద్భవిస్తాయో నాకు తెలియదు. కాని, ఒక్క విషయం మాత్రం నాకు నిశ్చయంగా తెలుసు— నా కలలు, కోరికలు, మనసు—అన్నీ నీ కోసమే! నీ ఒడిలో తల వాల్చిన ఈ నిమిషాలను శాశ్వతం చేసుకోనీయ్!" అని కలవరించిన రజని!

కలలన్నీ తన చుట్టూ నిర్మించుకున్న రజని!

మళ్లీ ఎనిమిది సంవత్సరాల తరవాత ఆమె పక్క సీట్లో కూర్చుని వాల్తేరు వెళ్లవలసి వస్తుందని నేను ఏ నాడూ ఊహించలేదు.

రైలు గట్టిగా కూత పెట్టి చిన్న కుదుపుతో ముందుకు కదిలింది.

"రజనీ!" అన్నాను ఉద్వేగంగా.

రజని నా వంక ఒక్క నిమిషం తేరిపార చూసింది.

తరవాత విస్మయంగా— "నువ్వా!" అంది.

"నేనే, రజనీ, కృష్ణని! ఏం, నువ్వు గుర్తు పట్టలేనంతగా మారిపోయానా?" విషాదంగా అన్నాను.

కాని, నా మాటలు నాకే రుచించలేదు.

ఈ ఎనిమిదేళ్లలోనూ నేను బాగా పొడుగు పెరిగాను. జీవితంలోని ఆవేశం, ఉత్సాహం చల్లారిపోవటం వలన చిక్కి పోయానేమోకూడా! నేను బాగా మారి పోయానన్న నిజం నాకు తెలుసు.

"అవును, మారిపోయావు!" అంది రజని పొడిగా.

ఆ మాటలు అంటున్నప్పుడు ఆమె ముఖంలో ఎలాటి భావమూ నాకు ద్యోతకం కాలేదు.

"అలా నిలబడి పోయావేం? కూర్చో" అంటూ నా బాగు పక్కకు సర్దింది. జేబులోని రుమాలు తీసి ముఖం తుడుచుకుంటూ సీటులో కూలబడి ఆమె వైపు చూశాను.

నెమలి కంఠం రంగు పట్టుచీరలో దివినుండి దిగిన దేవకన్యలా మెరిసి పోతూంది ఆమె. మునపటికంటె మరింత ఒళ్లు చేసి పుష్టిగా కనుపి స్తూంది. మెడలో వదులుగా ఉన్న ముత్యాలహారాన్ని ముడి వేసి మతారంగా గుండెలమీద వదిలేసింది. చెవులకున్న ముత్యాల దుద్దులు దీపకాంతిలో తళుక్కు మంటున్నాయి. అనుభవం వదిలిన నీలినీడల్లా కనురెప్పల క్రింద మాత్రం రెండు నల్లని గీతలు సన్నగా కనుపిస్తు న్నాయి. మాట్లాడినప్పుడు గొంతులో అదే జీర— వగరు చిగుళ్లు తిన్న కోయిల గొంతులో పలికే వంపులకు మల్లే! ఒక చేతికి బంగారు గొలుసుతో స్క్వేర్ వాచీ. రెండో చేతినిండా, బంగారు గాజులు సుమారు పదికి పైగా ఉంటాయి! చేతులు కదిలినప్పుడల్లా ఆమె ఐశ్వర్యాన్ని సన్నని సంగీత రూపంలో ప్రకటిస్తున్నాయి.

బహుశః ఎవరో ధనికుణ్ణే పెళ్లాడి ఉండాలి. మళ్లీ ఇన్నాళ్ల తరవాత కాదు, ఇన్నేళ్ల తరవాత— రజనిని కలుసు కున్నందులకు నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఎన్నో విషయాలు ఆమెతో మాట్లాడాలని తహతహగా ఉంది. కాని, నాలుగయిదు నిమిషాల వరకూ ఏం మాట్లాడాలో తోచక మూగవాడి గానే ఉండిపోయాను.

రైలు వేగం పుంజుకొని పరుగు తీస్తూంది. చల్లని గాలి కిటికీలోంచి వీచి ఒడలు తాకి పులకింతలు కలుగ జేస్తూంది. నా ఎదుటి సీట్లోని ముగ్గురూ ఉర్దూలో మాట్లాడుకుంటూ పగలబడి నవ్వుకుంటున్నారు.

రజని తాను చదువుతున్న పుస్తకం మూసి పక్కన పడేసింది. నుదుటిమీద పడి అల్లరి చేస్తున్న ముంగురులను సర్దుకుంటూ అడిగింది: "కృష్ణా! ఇప్పు డెక్కడుంటున్నావ్?"

"విశాఖపట్నంలో." తడుము కోకుండా అన్నాను.

"ఏం చేస్తున్నావ్?"

"ఆఁ! ఏమిటంటున్నావ్?" కాస్త తడబాటుతో అడిగాను.

"విశాఖపట్నంలో ఏంచేస్తున్నావ్?"

"రావ్ అండ్ సన్సులో ఆఫీసు మేనేజరుగా పనిచేస్తున్నాను." మాటలు ఆపి బట్టల వంక చూసుకున్నాను. నేను వేసుకున్న టెరీకాట్ పాంటు పది రోజులు మాసినదే అయినా, రంగులో కలిసిపోయి మాపు కనబడటం లేదు. ఈ దినమే వేసుకున్న టెరిలీన్ చొక్కా మాత్రం కాస్త కొత్తగానే మెరుస్తూంది.

"ఏ మాత్రం డ్రా చేస్తున్నావ్?" రజని అడిగింది.

పిడుగు పడింది!

ఏ ప్రశ్న ఆమె అడగకూడదని ఆశిస్తున్నానో అదే అడిగింది.

కాకపోతే 'ఎంతిస్తారేమిటి?' అని అడగకుండా కాస్త నాగరికంగా అడిగింది. అంతే.

సమాధానం కోసం కొంతసేపు తడుముకుంటూ, "మొగాళ్ల జీతం అడక్కూడదు" అన్నాను చిన్నగా నవ్వుతూ.

రజని నా వైపు వంగింది, ఏదో రహస్యం చెప్పబోతున్న దానికి మల్లే! ఆమె ఒంటికి రాసుకున్న అత్తరు పరిమళం ఒక్కసారి నన్ను చుట్టు ముట్టింది.

"ఎనిమిదేళ్ల క్రితం— మనం ఆఖరిసారిగా కలుసుకున్న సాయంత్రం— నువ్వు నన్ను అడిగిన ప్రశ్న గుర్తుందా? నా వయస్సు వెంటనే చెప్పాను. . ." రజని మాటలు ఆపి ఊపిరి పీల్చుకొంది. "అప్పుడు నువ్వు నా వయస్సు అడిగినప్పుడు నేను వెంటనే చెప్పాను! నేను నీ కంటె ఆరు నెలలు పెద్దదాన్ని. ఆ వయస్సే సాకుగా పెద్దలు మన పెళ్లికి ఒప్పుకోవటం లేదని చెప్పి నన్ను మధ్య పెట్టావు. ఆడది తన వయస్సు చెప్పచ్చు! మొగాడు తన జీతం చెప్పకూడదు కదూ?" మెల్లగా అంది.

నాకు ఊపిరి ఆడటం లేదు.

రజని మాట్లాడుతున్న విధానానికి తట్టుకోవటం చాలా కష్టంగా ఉంది.

జేబులోంచి సిగరెట్టు తీసి ముట్టిస్తూ, "పదిహేను వందలు" అన్నాను.

"అప్పుడు నీకు ఈ అలవాటు ఉండేది కాదు!" అంది.

నేను అబద్ధం చెపుతున్నట్టు కొంప తీసి రజని పోల్చిందా?

"ఏ అలవాటు?" అన్నాను సిగరెట్టు గట్టిగా పీల్చి.

"సిగరెట్టు కాల్చటం! ఆరోగ్యానికి అంత మంచిది కాదు. మానెయ్యకూడదూ?" మెత్తగా శాసిస్తున్న ధోరణిలో అంది. జీవితంలో ఒక్కసారి ప్రేమించిన ఆడది జీవితాంతం శాసించ గలదు కాబోలు!

"సిగరెట్టు కాల్చటం లాటి దురలవాటు ఉండటమే మంచిది!"

"ఏం? ఎందుకని?"

"మిగిలిన వాళ్లతో పోల్చుకొని మన కున్న దురలవాటు చాలా చిన్నదే అని సంతృప్తి చెందటానికి!" సిగరెట్టు చివర పేరుకున్న దుమ్ము చిటికేసి దులుపుతూ అన్నాను.

నా సమాధానానికి రజని నవ్వింది. వీణ తీగెల్ని బలంగా లాగి వదిలేస్తే దూరానికి వినబడే ప్రతిధ్వనిలా! ఆ నవ్వు పాతదే. ఎనిమిదేళ్ల పాతది. నవ్వి నప్పుడు రెండు తెల్లని ముత్యాల్లాటి పండ్ల మధ్య కెంపులా ఎర్రని ఇగురు బయటపడి తళుక్కుమంటుంది, తెల్లని మేఘశకలాల మధ్య పగిలిన సూర్య బింబంలా!

"నువ్వు చేసే పని తప్పని నీకు తెలిసినా, దాన్ని సమర్థించుకునే అలవాటు మాత్రం నీ కింకా పోలేదు. సిగరెట్టు కాల్చటం దురలవాటని ఒప్పుకున్నావు. అంతే చాలు" అంది నవ్వు ఆపి.

"మీ ఆయన సిగరెట్టు కాల్చడా?" కసిగా అడిగాను.

ఎందుకో నాకు తెలియకుండానే రజని భర్తమీద ఎప్పటినుండో, ప్రెజుడిస్ ఉంది. అది ఎలా ఏర్పడిందో నాకే తెలియదు. బహుశః రజనికికూడా నా భార్యమీద అలాటి అసూయే ఉండి ఉండాలి.

"ఉహుఁ! సిగరెట్టు కాల్చరు, కాఫీ తాగరు, కనీసం వక్కకూడా వేసుకోరు. అవును, ఆయన్ని నువ్వు చూడలేదు కదూ? నీ పెళ్లికి వద్దామనుకున్నాను కాని, నువ్వు పిలవలేదు. నా పెళ్లికి నిన్ను పిలిచాను కాని, నువ్వు రాలేదు!" మాటలు ఆపి రెండు చేతులతో మోకాలికి బిగించి నవ్వుతూ కాళ్లు ఊగిస్తోంది.

నే నేం సమాధానం చెప్పలేదు. 'ఔను! నా పెళ్లికి రజనిని పిలవలేదు. మరిచిపోయి కాదు, మొహం చెల్లక!'

"మా ఆయన ఎంత బాగుంటారో తెలుసా?" మాటలు ఆపి, మూతి సున్నాలా బిగించి నా వంకే చూస్తోంది రజని, నా ముఖంలోని భావాలను పసిగట్ట డానికి కాబోలు. ఆడదాని మనసు కన్న ఐన్‌స్టైన్ సిద్ధాంతమే తేలిగ్గా అర్థమవుతుంది అనుకుంటాను.

రజని ప్రశ్నకు నే నేం జవాబు చెప్పలేదు.

బొగ్గు పడుతూందని కిటికీ అద్దం కొంచెం దింపాను.

"మీ ఆవిడ బాగుంటుందా?" మళ్లీ ఆమే అడిగింది.

నేను సమాధానం చెప్పేలోగానే— "ఇరవై వేలు కట్నం తెచ్చిన పెళ్లాం బాగుండక నాపరాయిలా ఉంటుందేమిటి?' అంటూ నవ్వింది.

మాటల్లో ప్రతిసారీ రజనిదే పై చేయి అయిపోతూంది. తలుపులన్నీ మూసి ఊపిరాడని ఇరుకు గదిలో నన్ను బంధించిన అనుభూతి కలుగుతూంది.

"మీ ఆయన ఏ మాత్రం కట్నం తీసుకున్నాడేమిటి?" కసిగా అడిగాను, ఇంక ఆమె ధోరణికి నేను నోరు మూసు కొని ఊరుకోదలుచుకోలేదు.

"కట్నం ఇచ్చుకో గలిగితే నిన్నే చేసుకుని ఉండేదాన్నిగా! అప్పుడు నేను నీ కంటే ముప్పై సంవత్సరాలు పెద్దదాన్నయినా నీకు ఇబ్బంది ఉండేది కాదు! ఏమంటావ్?"


"రజనీ!" అసహనంగా అరిచాను. "ఎందుకలా ఆడిపోసుకుంటావ్? ఎనిమిదేళ్ల క్రితం జరిగిన సంగతుల్ని ఈనాడు మళ్లీ తవ్వి తలకెత్తుకుంటే నీ కేం కలిసి వస్తుంది చెప్పు?"

రజని మాట్లాడలేదు.

మా ఇద్దరి ప్రవర్తనకు ఎదుటి



VOLTAS

# ఉష్ణమందు చల్లని పిల్లవాయువు



వోల్టాస్ క్రిస్టల్ డీలక్స్

1 టన్ రూమ్ ఏర్ కండిషనర్, మునుపటి దానికంటె ఉత్తమం



ప్రపంచ-ప్రఖ్యాత క్యారీయర్ కాస్మొపోలిటన్,

అత్యాధునిక 1.5 టన్ రూమ్ ఏర్ కండిషనర్

ఆమోదిత వోల్టాస్ విక్రేత వద్ద లభించుచున్నది:

రేడియో అండ్ ఎలెక్ట్రికల్స్,

మెట్రో హౌస్, విశాఖపట్నం.

లక్ష్మీవారపుపేట, రాజమండ్రి.

వోల్టాస్ వారి సమర్పణ:

చల్లబరచుటలో శ్రేష్ఠం

CMVAC-21-103 TL

సీట్లోని ముగ్గురూ విచిత్రంగా చూస్తున్నారు.

"రజనీ! నువ్వు చాలా మారిపోయావు" అన్నాను కొంత సేపు మాటల కోసం తడుముకుంటూ.

"నువ్వు బాధపడుతున్నట్లున్నావ్. ఏమయినా కబుర్లు చెప్పు!" అంది రజని.

"దాహంగా ఉంది. నీ వద్ద మంచి నీళ్లున్నాయా?" అన్నాను, సిగరెట్టు కిటికీలోంచి అవతలకు పారేస్తూ.

"ఓ! ఫ్లాస్కులో ఐస్ వాటరు ఉంది. ఇస్తా ఉండు." అంటూ ముందుకు వంగి ఎదుట సీటు క్రింద నుండి పేముబుట్ట బయటకు లాగి అందులోంచి ఫ్లాస్కు తీసింది.

ముందుకు వంగిన రజనిని పరిశీలనగా చూస్తూ కళ్లు తిప్పుకోలేకపోయాను. గుండెలమీద నుండి జారిన ముత్యాల హారం సుతారంగా ఊగుతూ చుబుకాన్ని ముద్దాడుతూంది. పుస్తెలు కిందకు జారి గలగల మన్నాయి.

పైట సర్దుకుంటూ ఫ్లాస్కు మూతలోకి నీళ్లు వంపింది రజని. కప్పును రెండు వేళ్లతో కడిగి నీళ్లు అవతల ఒంపటానికి నా మీదుగా కిటికీ వైపు వంగింది. నాకు ప్రాణాలు జివ్వుమంటున్నాయి!

ఆమె ఒళ్ళు నాకు తగిలితే బాగుండును.

కప్పులో నీళ్లు ఒంపేసి, "అబ్బ! బొగ్గు పడింది!" అంటూ కుడి కన్ను బిగించింది.

"ఉండు! నేను ఊదుతా!" అంటూ ఆమె చెంపలమీద వేళ్లు అన్చి బలవంతంగా కనురెప్పలు విడదీసి గట్టిగా ఊదాను.

రజని మెత్తని చెంపలు తగిలేసరికి నే నేదో వింత మనిషి నయినట్లు ఫీలయ్యాను.

"పోయిందిలే! ఈ ఒక్క క్షణం ఎంత బాధ పెట్టింది!" అంటూ కన్ను రుమాలుతో అద్దుకుంటూ, నాకు నీళ్ళు పోసి కప్పు అందించింది.

నీళ్లు తాగుతూంటే పళ్లు జివ్వుమని లాగుతున్నాయి. మెల్లగా చప్పరిస్తూ అన్నాను: "కాజీపేటలో భోజనం చేద్దాం! నాన్-వెజిటేరియన్ తీసుకుంటావా?"

"వద్దు. నేను తినటం మానేశాను— మా ఆయనకు ఇష్టం ఉండదు."

"ఏమిటి? భోజనమా?"

"కాదు. నాన్-వెజిటేరియన్!"

"మీ ఆయనకు ఇష్టం లేనివి ఇంకేం మానేశావ్?"

"ఆయనకు ఇష్టం లేనివి అన్నీ మానేశాను." నిశ్చలంగా అంది రజని.

"అయితే, మొత్తానికి బానిసలా బ్రతుకుతున్నా వన్నమాట!"

రజని నా వంక ఆశ్చర్యంగా చూసింది. "ఇందులో బానిసత్వ మేముంది?, జీవితాంతం తోడుగా నిలిచే భర్త కోసం కొన్నిటిని త్యాగం చేయటంలో ఆనందం లేదూ? నా కోసం మా ఆయన ఎన్నో పద్ధతుల్ని మార్చుకున్నారు. అంత మాత్రాన ఆయన నాకు బానిసయ్యారని అనమంటావా? అయినా, భార్యాభర్తల మధ్య హెచ్చు తగ్గులేమిటి?"

మాటల్లో మళ్లీ రజనిదే పైచేయి అయిపోతూంది! నా అహం ప్రజ్వరిస్తూంది.

"అయితే,నాన్-వెజిటేరియన్ తీసుకోనంటావు!"

"ఊహుఁ! తీసుకోను" అంది రజని నిశ్చలంగా.

"సరేలే! నీకు కావలిసిందే రప్పిస్తాను. ఈ రాత్రికి మాత్రం నువ్వు నా గెస్టువి!"

"తప్పకుండా."

నీళ్లు ఖాళీ చేసి కప్పు ఆమెకు అందించాను. కప్పు బుట్టలో పెట్టడానికి మళ్లీ ఆమె వంగితే బాగుండును. కాని, ఆమె అలా చెయ్యలేదు. కప్పు తన పక్కనే పెట్టుకుంది.

"మీ ఆయన ఏం చేస్తుంటారు?" అన్నాను.

"చెప్పనా?" అంది కనురెప్పలు క్రిందకు వాల్చుకుంటూ.

"ఊఁ! చెప్పు!" అన్నాను.

"రోజులో కనీసం పన్నెండు గంటలు నా కళ్లలోకి చూస్తూ కూర్చుంటారు!" చిలిపిగా నవ్వుతూ అంది.

నాకు మనసులో అరణ్యాలు దహిస్తున్నాయి. రజని కావలిసే నన్ను రెచ్చగొడుతూందా?

"మిగిలిన సమయంలో?" రోషంగా అడిగాను.

"మాకు ఏలూరు దగ్గరలో చాలా భూము లున్నాయి. వ్యవసాయపు పనులు చూసుకుంటూ ఉంటారు!"

"పిల్లలెంతమందేమిటి?"

"ఒక్కడే — బాబు! అయిదేళ్ళు నిండాయి. హైదరాబాదులో మా మేనకోడలు పెళ్లి జరిగితే వెళ్లొస్తున్నాను. బాబుని ఆయన దగ్గరే వదిలేశాను."

"బాబుకి ఏం పేరు పెట్టావ్?" ఆత్రంగా అడిగాను. నా పేరే పెట్టిందేమోనని ఆశ.

"కృష్ణ!" అంది నిశ్చలంగా.

నాకు మనసు నిండా ఏదో తృప్తి నిండినట్లయింది. "మొత్తానికి నా పేరే పెట్టావన్నమాట!" గర్వంగా, తృప్తిగా నవ్వుతూ అడిగాను.

"కాదు. ఆ పేరు మా వారు పెట్టుకున్నారు. ఆయనకు కృష్ణుడంటే చాలా ఇష్టం!"

కనీసం నాకు ఈ తృప్తి నయినా మిగల్చటం రజనికి ఇష్టం లేదు కాబోలు.

తరవాత కొంతసేపు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

రజని ఎలా మారిపోయింది? ! ఎన్ని మాటలు నేర్చింది! !

స్త్రీకి బాల్యావస్థలో బొత్తిగా వ్యక్తిత్వం ఉండదు కాబోలు. అమాయకత్వం తప్ప ఇంకేం తెలియ దనుకుంటాను. అయితే, యౌవనంలో ప్రవేశించి నిర్దుష్టమయిన వ్యక్తిత్వం ఏర్పరుచుకునే వేళలో స్త్రీ ఇంకొకరికి అర్పితమయిపోవటం జరుగుతుంది. తరవాత ఆ వ్యక్తిత్వం ఆరిందాతనంగా మారిపోతుం దనుకొంటాను.

రజనిలో నాకు నిర్దిష్టంగా అలాటి మార్పే కనుపిస్తూంది. లేక ఈ మార్పుకు కారణం తన భర్త ధనవంతుడనే అహంకారమా? మనసు రకరకాలుగా ఆలోచిస్తూంది.

కిటికీ అద్దం పూర్తిగా పైకి ఎత్తి తల బయటకు పెట్టాను. ఎదురుగా ఒక్క చెట్టయినా కనబడటం లేదు.

పల్చని వెన్నెలలో స్నానం చేస్తున్న చిన్న చిన్న పొదలు, డొంకలు మాత్రం తొందరగా వెనక్కు జరిగిపోతున్నాయి. నీలం రంగు ఆకాశం మీద ముత్యాలు అద్దినట్లు అక్కడక్కడ నక్షత్రాలు మినుకు మినుకు మంటూ కన్ను గీటుతున్నాయి.


దూరంగా కనుపిస్తున్న దీపాల కాంతి క్రమేణా దగ్గరవుతూంది.

కొద్ది నిమిషాలలోనే రైలు కాజీపేట స్టేషనులో ఆగింది. "నేను భోజనం తీసుకు రమ్మని చెప్పి వస్తాను" అంటూ లేచి బయటకు వచ్చాను. కంపార్టుమెంటులోకి భోజనాలు తెమ్మని చెప్పి డబ్బు చెల్లించాను కాంటీనులో! జేబులో ఇంక పన్నెండు రూపాయలు మాత్రం మిగిలాయి. వాల్తేరు వెళ్లే వరకూ వాటితోనే గడుపుకోవాలి. ఒక సిగరెట్టు పెట్టె తీసుకుని రెండు కిళ్లీలు కట్టించాను. నేను పెట్టెలోకి వెళ్లేసరికి భోజనాలు వచ్చి సిద్ధంగా ఉన్నాయి. ఇద్దరం భోజనాలు ముగించాం. కాంటీను కుర్రాడు వచ్చి ప్లేట్లు తీసుకొని వెళ్లిపోయాడు.

ఎదుటి సీట్లోని ముగ్గురూ బెర్తులు

"బాలానాం రోదనం బలం"

ఫోటో—కె. గజేంద్రన్ (మద్రాసు–17)



దింపుకొని నిద్రకు ఉపక్రమించారు. రైలు కాజీపేటనుండి బయలుదేరింది.

"నీకు మీ ఆవిడమీద ప్రేమ లేదా?" రజని ప్రశ్నకు కళ్ళు చిట్లించి చూశాను. ఆమె చిన్నగా నవ్వుతూంది. నోట్లోని తాంబూలంతో ఆమె బుగ్గలు మరింత గుండ్రంగా తయారయ్యాయి. సుప్రభాత సమయంలో తూర్పు దిక్కున పగిలిన అరుణ వర్ణంలా ఆమె పెదాలు ఎరుపుదనం పులుముకున్నాయి.

"మొగాడి పెదాలు పండకపోతే భార్యమీద ప్రేమ లేదంటారు!" అంది మళ్ళీ.

"మీ ఆయన పెదాలు బాగా పండుతయా?" అసలు ఈ ప్రశ్న వేయకూడదనుకున్నాను, కాని రజని ధోరణే నా చేత ఇలాటి ప్రశ్నలు వేయిస్తూంది.

"మా ఆయన అసలు తాంబూలం వేసుకోరుగా! అయినా ఆయన పెదాలు ఎప్పుడూ ఎర్రగానే ఉంటాయి!" మెల్లగా అంది.

నే నేం మాట్లాడలేదు.

రజని తత్త్వం క్షణక్షణానికీ నాకు అంతుబట్టకుండా పోతూంది.

నా కన్న అన్ని విధాలా ఆమె భర్త గొప్పవాడని చెప్పటానికి రజని ఈ విధంగా ప్రవర్తిస్తూందో? ఏమో?

చివర కూర్చున్న మధ్యవయస్సావిడ ఏదో గొణుగుతూంది. రజని నా వైపు తిరిగి, "ఆవిడకు నిద్ర వస్తూంది కాబోలు. టైము పదకొండు దాటిందిగా. నువ్వు పై బెర్తు మీదకు వెళ్ళిపో!" అంది.

ఆవులిస్తూ లేచి నిలబడ్డాను.

నా బాగు తీసి పై బెర్తుమీద తల వైపున పెట్టుకున్నాను. రజని లేచి నిలబడి గొలుసులు వదులు చేసి మధ్య బెర్తుకూడా దింపింది. నేను బాత్‌రూంకు వెళ్ళి వచ్చేసరికి క్రిందనున్న ఆవిడ పక్క పరుచుకొని నిద్రకు ఉపక్రమించింది. రజని తన బెడ్డింగును మధ్య బెర్తుమీద పరిచింది.

నేను పై బెర్తుమీదకు ఎక్కాక జ్ఞాపకానికి వచ్చింది, కనీసం తలక్రింద ఉంచుకునేందుకు దుప్పటి అయినా నా వద్ద లేదని. నా బాగులో ఒక తువ్వాలు, మరో జత బట్టలు మాత్రం ఉన్నాయి!

రజని తన బెడ్డింగులోనుండి డన్‌లప్ తలగడా తీసి నాకు అందించింది. "మరి నీకో?" అన్నాను మొహమాటంగా అందుకుంటూ.

"ఇంకొకటి ఉందిలే!" అంది.

తరవాత కిటికీ వైపు వచ్చి నీలం దీపాలు వెలిగించి పెద్ద బల్బులు ఆర్పేసింది.

దిండు సర్దుకొని మెల్లగా నడుము వాల్చాను.

దిండు కవరుమీద రెండు జంట పక్షులు ముచ్చటగా కబుర్లు చెప్పుకుంటున్నట్లు అందమయిన ఎంబ్రాయిడరీ ఉంది. గట్టిగా కళ్ళు మూసుకుని తలగడలో ముఖం దూర్చాను.

వలిగిపోయిన మల్లెల వాసన, అత్తరు పరిమళం, ఆరిపోయిన తలనూనె వాసన అన్నీ కలిపి ఒక్కసారి ఉక్కిరిబిక్కిరి చేశాయి.

ఈ దిండుమీద తల ఆన్చి రజని ఎన్ని స్వప్నాలతో తేలిపోయిందో! ఎన్ని కన్నీళ్ళు కార్చిందో! కళ్ళు మూసుకొని నిద్ర పోదామనుకున్నా, ఎడతెరిపి లేని ఆలోచనలు వెంట తరుముతున్నాయి.

ఎనిమిది సంవత్సరాల క్రితం—

విజయవాడ కాలేజీలో డిగ్రీకోర్సు చదువుతున్న రోజుల్లో రజనినే నా జీవిత సర్వస్వంగా భావించాను. గలగల పారే కృష్ణవేణమ్మ ఒడ్డున కూర్చుని మే మిద్దరం బంగారు కలలు కన్నాం. రంగు రంగుల ఊహల్ని భవిష్యత్తు కోసం పేర్చుకుంటూ కాలం గడిపాం.

అయితే అవన్నీ కేవలం కలలుగానే మిగిలిపోయాయి! నా తరవాత పెళ్ళీడు కెదిగిన ముగ్గురు చెల్లెళ్ళు ఉండేవారు. వారి పెళ్ళిళ్ళకు కట్నాలు ఇవ్వటం కోసం నేను ఇరవై వేలకు అమ్ముడు పోవలసి వచ్చింది. నా చుట్టూ రజని నిర్మించుకున్న ఊహల సౌధాలను ఆశల హర్మ్యాలనూ నిర్దాక్షిణ్యంగా కూల్చివేయ వలసి వచ్చింది.

పరీక్షలు వ్రాసి ఆ నాడు విజయవాడ వదిలి వెళ్ళిపోయిన రజనిని మళ్ళీ ఈ వేళే చూడటం! చెల్లెళ్ళ వివాహాలకు నా కట్నంతోబాటు మిగిలిన స్థిరాస్తికూడా హరించుకు పోయింది.

డిగ్రీ చేత బుచ్చుకొని తిరిగిన ఊరు తిరక్కుండా అనేక ఉద్యోగాలు చేశాను. కేవలం కుటుంబాన్ని నడపటం కోసం! పోషించలేని స్థితిలో కొన్ని దినాలు నా భార్యనూ, పిల్లల్నీ మామగారి ఇంటి వద్ద వదిలేసిన రోజులుకూడా ఉన్నాయి.

కొద్ది నెలలుగా నేను సికిందరాబాదులో చేస్తున్న 'టెంపరరీ' ఉద్యోగం కాస్తా నెల దినాల క్రితమే ఊడిపోయింది. భార్యనూ, పిల్లల్నీ మామగారి ఇంటికి వాల్తేరు పంపించేశాను.

ఈ నెల దినాలుగా హైదరాబాదులో ఉద్యోగప్రయత్నాలు చేస్తూంటే జేబులో ఉన్న ఆఖరి రెండొందలుకూడా ఆరి పోయాయి. వాల్తేరులో 'రావ్ అండ్ సన్స్'లో 'క్లార్కు' పోస్టు ఖాళీగా ఉందనీ, దాని కోసం ప్రయత్నిద్దామనీ మా మామగారు ఉత్తరం రాశారు. ఒక మిత్రుని వద్ద డబ్బు అప్పు తీసుకుని వాల్తేరు బయలుదేరాను.

అయితే— ఈ పరిస్థితి అంతా రజనికి తెలియజేయటం నాకు సుతరామూ ఇష్టం లేదు. కేవలం డబ్బు కోసం ఆ నాడు రజనిని కాదని నేను వేరొకర్ని చేసుకున్నాను. మళ్ళీ ఈ నాడు డబ్బు విషయంలో రజనిని నాకంటే ఉన్నతమయిన స్థానంలో ఊహించటానికి నా మనసు అంగీకరించటం లేదు.

నా ఊహలు చాలా నీచమయినవి కావచ్చు. కాని అహం, ఆత్మగౌరవం నన్ను వెంటాడుతున్నాయి. నేను నీచంగా బ్రతుకుతున్నట్లు రజనికి తెలియకూడదు. తెలిస్తే నా బ్రతుకే తేలికయిపోతుంది. వీల్లేదు. ఈ నిజం రజనికి తెలియకూడదు. నా దరిద్రాన్ని బయట పెట్టటానికి నా అంతరాత్మ ఒప్పుకోవటం లేదు.

ఏ నాడూ ఊహించని ఈ రకమయిన పరిస్థితి ఎదురయినందుకు మనసు విలవిల్లాడుతూంది. కంటిమీద కునుకు రావటం లేదు.

దిండులోంచి తల ఎత్తి మెల్లగా కనులు విప్పాను. నా క్రింది బెర్తుమీద — నాకు అతి చేరువగా— రజని నిద్ర పోతూంది, అతి ప్రశాంతంగా!

తదేకంగా ఆమె వైపు చూశాను.

ఒకటి రెండు ముంగురులు గాలికి ఎగిరి నుదుటిమీద పడి కొట్టుకుంటున్నాయి— ఒడ్డున పడ్డ చేపపిల్లలకు మల్లే! నున్నని బుగ్గమీద లేత నీలం రంగు కాంతి పడి ప్రతిఫలిస్తూంది. నిశ్చల ధ్యానముద్రలో ఉన్న ఋషికి మల్లే ఆమె కనురెప్పలు మెత్తగా మూసుకొని ఉన్నాయి!

తనను ఎంతో కలవర పెట్టింది ఈ నాటి అనుభవం. మనసును కలిచి వేసింది.

అయితే దీనితో తనకు సంబంధం లేనట్లు నిద్ర పోతూంది రజని! ఆడవాళ్ళు ఎంత విచిత్రంగా ఉంటారు.

గాజులు గలగల మన్నాయి. నిద్రలోనే ఒక పక్కకు కొద్దిగా ఒత్తిగిలింది రజని! కిటికీలోంచి వీస్తున్నగాలికి ఆమె పట్టుచీర చెరగు పక్కకు చెదిరింది.

రజని అందమయిన ఊపిరి నన్ను కలవరపెడుతూంది. మెల్లగా చేయి వంచి ఆమె బుగ్గలమీద చూపుడు వేలుతో రాశాను.

మెల్లగా కనులు విప్పింది రజని. కంగారుగా చేయి వెనక్కు లాక్కున్నాను! గుండెలు గుబ గుబ మంటున్నాయి!

కనులు విప్పిన రజని నవ్వుతూంది, పెదాలు విప్పకుండానే! పెదాల మధ్య చిందులు వేసిన నవ్వు చిత్రంగా అక్కడే ఇంకి పోతూంది!

"కృష్ణా! నిద్ర పట్టడం లేదా?" రజని ప్రశ్నలో ఎలాటి భావమూ లేదు. మాటల్లో ఎంతో నిశ్చలత— మిన్ను విరిగి మీద పడినా చలించని నిశ్చలత!

"ఊహూఁ!" అన్నాను గోముగా ఆమె వంక చూస్తూ.

"పరుపు లేకుండా నిద్ర పోవటం అలవాటు లేదేమిటి?" నే నేం మాట్లాడ లేదు.

"పోనీ, ఇలా వచ్చి నా బెడ్డింగు మీద నిద్రపో! నేను పైకి వెళతాను!" మళ్ళీ ఆమే అంది.

"అక్కరలేదు. కాస్త తలనొప్పిగా ఉంది. అంతే." అన్నాను అసహనంగా.

రజని మాట్లాడలేదు. మళ్ళీ కళ్ళు మూసుకొంది. అర్థం లేని ఆలోచనల మధ్య సుమారు గంట సేపు సతమతమయ్యాను.

తరవాత నాకు తెలియకుండానే నిద్రలోకి జారిపోయాను.

* * *

నాకు తెలివి వచ్చేసరికి బాగా తెల్లారిపోయింది.

పలచని నీరెండ కూడా పరుచుకుంటూంది.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ లేచి క్రిందకు చూశాను. ఎదురుగా అద్దం పెట్టుకొని జుత్తు ముడివేసుకుని పిన్నులు సవరించుకుంటూంది రజని! అప్పుడే స్నానం కూడా చేసినట్లుంది. చిలకాకు పచ్చని పట్టు చీర కట్టుకుంది.

అద్దంలో నా ముఖం కనబడినట్లుంది. "బాగా నిద్ర పట్టిందా?" పళ్ళ మధ్య పిన్ను నొక్కి పట్టుకుంటూ నా వైపు చూడకుండానే అడిగింది.

"ఊఁ!" అన్నాను ఆవులిస్తూ.

"విజయవాడ దాటిపోయింది. నిన్ను లేపుదా మనుకుంటున్నాను కాని నిద్ర పాడుచేయటం ఇష్టంలేకపోయింది! ఫ్లాస్కులో కాఫీ ఉంది, ముఖం కడుక్కొని రా! తాగుదువుగాని!" అంది.

తువ్వాలు భుజం మీద వేసుకుని బాత్‌రూం వైపు నడిచాను. నేను తిరిగి వచ్చేసరికి బెడ్డింగు తాళ్ళు బిగిస్తూ

---

### సంపన్నుడు

డబ్బు కూడబెట్టినవాడు సంపన్నుడు కాదు. సంపాదించిన డబ్బులు దానధర్మాలకు సెలవుచేసేవాడే నిజమైన సంపన్నుడు.

—టి. బ్రౌన్

---

ఉంది రజని. ఫ్లాస్కు కప్పులో కాఫీ పోసి ఇచ్చింది. వేడి కాఫీ తాగేసరికి బద్ధకమంతా వదిలిపోయినట్లయింది.

రజనికి బెడ్డింగు బిగించటంలో సాయం చేశాను.

"ఇంకో పావు గంటలో ఏలూరు వచ్చేస్తుంది!" అంది.

కదులుతున్న కాలాన్ని నేను శాసించి ఆపలేను!

"కృష్ణా! ఎప్పుడయినా మా ఇంటికి రా! మీ ఆవిణ్ణీ, పిల్లల్నీ కూడా తీసుకు రావాలి!" అంటూ తన భర్త చిరునామా కార్డు ఒకటి తీసి అందించింది.

'ఎస్. శ్రీనివాసరావు, లాండ్‌లార్డ్, రామచంద్రరావు పేట, ఏలూరు' అని బంగారు రంగులో అక్షరాలు అందంగా ముద్రించబడి ఉన్నాయి దాని మీద. కార్డు జేబులో పెట్టుకుంటూ, "తప్ప కుండా వస్తాను" అన్నాను. కొద్ది నిమిషాల్లోనే రైలు పవరు పేట స్టేషను చేరుకుంది. లైసెన్సు కూలీని కేకేసి, రజని సామన్లన్నీ వాడికి ఒప్పగించాను.

"వెళ్లొస్తాను, కృష్ణా!" అంటూ మెల్లిగా గేటు వైపు కదిలింది రజని.

సమాధానం చెప్పటానికి మాటలు రాక మూగవాడినే అయ్యాను.

రజని కనుమరుగయ్యేంత వరకూ ప్లాట్‌ఫారం మీద నిలబడి ఆమెవంకే చూస్తూ ఉండిపోయాను.

రైలు కూతవేసి మెల్లగా కదిలింది.

గబగబా కంపార్టుమెంటులోకి ఎక్కి సీటు వద్దకు చేరుకున్నాను.

రజని కూర్చున్న సీటు ఖాళీగా మిగిలి పోయింది, నా మనసులాగే!

ప్రయాణిస్తున్న రైలులో ఎక్కే వాళ్లు ఎక్కటం, దిగేవాళ్లు దిగటం జరుగుతూనే ఉంటుంది. విచిత్రంగా కలిసి ఉండటం, ఎవరి స్టేషను రాగానే వాళ్లు దిగిపోవటం. అంతే ! !

జీవితం కూడా అలాటిదే ననుకుం టాను. ఎనిమిదేళ్ల క్రితం ఊహల రైలులో, ఆశల పట్టాల మీద నేనూ రజనీ కలిసి పయణించాం! నా స్వార్థా నికి రజినిని బలిచేసి నేనే ముందు దిగి పోయాను. గమ్యం తెలియకుండా రజని ముందుకు సాగిపోయింది. అయితే, ఈ నాడు అయోమయావస్థలో నన్ను వదిలి తానే ముందుగా తన గమ్యంలో దిగి పోయింది!

అయితే, నాకు మిగిలిన తృప్తి ఒక్కటే. ఈనాటి నా పరిస్థితి గురించి రజనికి తెలియలేదు. తెలిస్తే ఆమె దృష్టిలో నేను ఇంకా చులకనయిపోయి ఉండేవాణ్ణేమో? అలా జరగనందు లకు మాత్రం నన్ను నేనే అభినందించు కున్నాను.



తలపులు చిత్రం—వేటూరి సుబ్రహ్మణ్యం (హైదరాబాద్-36)

సిగరెట్టుకోసం పై బెర్తు మీద ఉన్న బాగ్ తీశాను. పక్క 'పాకెట్'లో చేయి పెట్టేసరికి సిగరెట్టు పెట్టెతో బాటు ఏవో కాగితాలు తగిలాయి. బయ టకు తీశాను. అందులో ఒకటి మామయ్య నన్ను వాల్తేరు బయలుదేరి రమ్మని వ్రాసిన ఉత్తరం. రెండోది రోజా రంగు కాగితం మడత! ఆత్రంగా విప్పాను! దానిలోంచి రెండు వందరూపా యల కాగితాలు క్రింద బడ్డాయి! ఆశ్చ ర్యంగా వాటిని తీసి రోజా రంగు కాగితం చూశాను.

అది రజని ఉత్తరం!

సీట్లో కూలబడి ఆత్రంగా చదివాను.

"కృష్ణా!


ఈ జీవితాలు ఎంత విచిత్రమయినవి!

కలుసుకోవడం, విడిపోవటం, ఈ రెండింటి మధ్య తీయని అనుభూతులు, భరించలేని బాధలు! మిగిలేవి జ్ఞాపకాల నీడలు మాత్రమే!

ఎనిమిదేళ్ల క్రితం మనం జీవితంలో కలుసుకున్నాం. ఎన్నో కలలు కన్నాం! భవిష్యత్తుకోసం బంగారు మేడలు నిర్మించుకున్నాం ఊహల్లోనే! కాని — నువ్వు నన్ను మోసం చేశావు. కాదు — నిన్ను నువ్వు మోసం చేసుకున్నావ్!


# నానబెట్టిన ధాన్యాలను రుబ్బు మెషినులు

## (SOAKED FOOD GRAINS GRINDING MACHINES)



* మా మినీ టైప్ గ్రైండర్ గృహావసరాలకు చాల అనువైన నమూనా ప్రతి ఇంటా అవశ్యం ఉండవలసినది.
* మా మెషినులు ఉన్నత సాంకేతిక నిపుణులచే తయారుచేయబడినవి. గ్యారంటీతోను మంచి సర్వీసు హామీతోను అమ్మబడుచున్నవి.
* ఇళ్ళలో వాడదగిన సైజు నుంచి, హొటళ్ళలో, కాంటీన్లలో మరియు వ్యాపారసరళిలో వాడదగిన వాటివరకు వివిధమైన 25 కు పైబడిన నమూనాలు మావద్ద హాజరుగ లభిస్తున్నవి.
* దక్షిణభారతదేశంలో మా మెషిన్లు 2500 లకు పైగా మా వాడకం దార్లకు పూర్తిగ సంతృప్తికరంగా పని చేస్తున్నవి.
* మేము కాఫీగ్రైండర్లు, రోస్టర్లు, ఉర్లగడ్డ పెచ్చుతీయు మెషిన్లు, నీటిపంపుసెట్లు, పిండిమరలు మొదలైనవాటినికూడ సప్లయి చేస్తున్నాము.



ఇతర వివరాలకు దయచేసి వ్రాయండి :

# శ్రీ బాలాజీ మిల్ స్టోర్స్,

**145/ఏ, రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాద్-3.**

ఫోన్లు: ఆఫీసు: 77327
నివాసం: 78103

ARTEX

## మీరు బలహీనముగా వున్నప్పుడు, మీకు దగ్గు జలుబులు వదిలేటట్లు కనిపించదు

దీనికి పరిహార మేమిటంటే, దగ్గు జలుబులను ఎదుర్కొనేటప్పుడే, శరీరపు రోగనిరోధక శక్తిని పెంపొందించాలి. ఎర్ర లేబిల్ గల వాటర్‌బరీస్ కాంపౌండ్ మాత్రమే ఈ రెండు పనులను ఒకే సమయములో చేయగలదు. అది దగ్గు జలుబులకు ఉపశమనము కలిగిస్తుంది మరియు బలహీనతను పోగొట్టి శక్తిని పెంపొందించును. ఇప్పుడు 2 సైజులలో లభిస్తోంది.




శక్తి, ఆరోగ్యమును నిలబెట్టుకొనుటకు...

**వాటర్‌బరీస్ కాంపౌండ్**
ఎర్ర లేబిల్

అత్యంత నమ్మకమైన కుటుంబ టానిక్

వార్నర్-లాంబెర్ట్ వారి
ఉత్కృష్టమైన తయారీ




అయితే అప్పుడు నేను నీకోసం బెంగ పెట్టుకొని తల్లడిల్లి పోలేదు. విరహ గీతాలు పాడుకోలేదు. మనుష్యుల నైజాలు అర్థం చేసుకున్నాను. లోకం అంటే ఏమిటో తెలుసుకున్నాను.

నేను ప్రేమించే వ్యక్తి కాదు నాక్కావలసింది! నన్ను ప్రేమించే వ్యక్తి నాకు కావాలని తెలుసుకున్నాను! అందుకే నన్ను ఆరాధించే వ్యక్తిని, శ్రీనివాసరావుని గార్ని వివాహమాడాను!

నా జీవితం చాలా సుఖంగా సాగిపోతూంది! అయితే — మళ్లీ ఎనిమిదేళ్ల తరవాత ఈ నాడు రైల్లో కలిశాం మనం! నిన్ను మళ్లీ కలిసినందుకు ఎంతో ఆనందించాను. మంచి జీతం తెచ్చుకుంటూ హోదాలో ఉన్నట్టు నీవు చెప్పినప్పుడు ఎంతో సంబరపడ్డాను. కాని నా ఆనందమంతా కొద్ది గంటల పాటే మిగిలింది.

ఉదయం నేను లేచేసరికి నీ బాగ్ క్రిందపడి ఉంది. 'సైడ్ పాకెట్' లోంచి ఒక ఉత్తరం తొంగిచూసింది. పరుల ఉత్తరాలు చదవకూడదన్న విషయం నాకు తెలుసు — కాని, నువ్వు నాకు పరాయివాడివి కాదు! కుతూహలం చంపుకోలేక ఉత్తరం తీసి చదివాను.

అది మీ మామగారు నీకు వ్రాసిన ఉత్తరం. నీ పరిస్థితి అంతా నాకు అర్థమయింది. ఇంకా నిన్ను నువ్వు మోసగించుకుంటూనే బ్రతుకుతున్నావన్న మాట!

కృష్ణా! ఎనిమిదేళ్ల క్రితం ఆత్మ వంచన చేసుకుని ఒక ఆత్మీయురాలిని వదులుకున్నావు. ఆనాటి నీ పరిస్థితే అందుకు కారణమని నాకు నేనే సర్ది చెప్పుకున్నాను. ఈ నాడు వంచనతో ఒక స్నేహితురాలిని కూడా పోగొట్టుకోకు! నేను నీకు సహాయం చేయలేనని నువ్వనుకోవచ్చు! కాని, కనీసం సానుభూతినయినా చూపించగలను! నిన్న రాత్రి మాటలతో నీ మనసును బాధించి ఉంటే క్షమించు!

ఏలూరులో మా ఆయనకు మంచి పలుకుబడి ఉంది. ఆయన ప్రయత్నిస్తే నువ్వు బ్రతకటానికి అవసరమయిన ఉద్యోగం నీకు సులువుగా చూపించగలరు. త్వరలోనే ఆ ప్రయత్నం చేసి మీ మామ గారి చిరునామాకు ఉత్తరం రాయిస్తాను తప్పకుండా వచ్చేయ్!

ఈ ఉత్తరంతోబాటు రెండువందల రూపాయలు ఉంచుతున్నాను. నీకు పట్టు చీరలంటే ఇష్టం కదూ? మీ ఆవిడకో పట్టుచీర కొని నా కానుకగా ఇయ్యి. తప్పుగా అర్థంచేసుకోకు!

ఉంటాను, మరి.

స్నేహితురాలు
రజని." ★